## గొప్పవారితో గుసగుసలు

# తిమ్మన, ధూర్జటి

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[హంపీలో సీతా సరోవరానికి హనుమంతుడి గుహకు మధ్య నున్న చెప్టామీద కూర్చుని తిమ్మన, ధూర్జటి మాట్లాడు తుంటారు. నేను సరోవరంలో కాళ్లూ చేతులూ కడుక్కుని వచ్చేటప్పటి కీ సంభాషణ జరుగు తూంటుంది.]

ధూర్జటి : ...వచ్చేటప్పటి కేమిటి మిమ్మల్ని వాండ్లడుగుతూంది?

తిమ్మన : నా గ్రంథంలో నొక పద్యాన్ని విమర్శిస్తున్నారు.

ధూ : నిన్న మిమ్మల్ని విమర్శించారూ! ఈ రోజే జితని ఉపాసన మంత్రం వినుపించే టప్పటికి నా వెంట బడ్డారు! నా కావ్యంలో పద్యాన్ని పుచ్చుకొని—

(నన్ను) కూర్చోవోయ్—

ఏకడ మారంభించారు. దండు మనుషులులా లాగున్నారు!

తి : నెమ్మదిగా నంటావేం? మహా చెడ్డ వాళ్లు. నన్నంటారూ, "ఏ మండీ,

'ఎలదేటు లుద్దమవాల్తు కన్గవలపై
నిండీ వరభ్రాంతిచే
మెలగన్ జేరల గప్పుకో నలవి కా
మిన్ జీదరం జెంది ని
చ్చలు గాంక్షించిరి నిర్నిమేష జలజా
స్యల్ మానుషత్వంబు, న
య్యలిభీతిన్ ముకుళీ కృతాక్షియగు స
త్యా కాంత నీక్షించుచున్'

అని వర్ణిస్తిరే! ఏమని వర్ణించారండీ అట్లా? చేరల్తో కప్పుకోలేనంత చాటల్లా గున్నాయండీ మా కండ్లూ? మానుషత్వాన్ని 'నిచ్చలు గాంక్షించిరి' అండానికి మే మెప్పుడూ పనీ పాటా లేకుండా పూలతోటల్లో తిరుగుతూంటా మా, తుమ్మెదల్ను తోలుకోలేక ఆ కోర్కె కోరడానికి!" అని నలుగురో, ఐదుగురో వచ్చి ఒకటే గోలగా ఆరంభించారు.

ధూ : నన్నూ అట్లాగే కాళహస్తి మహాత్మ్యంలో—

"పరిచిత బంధ నైపుణీ న
పారకళానుభవప్రసక్తి నా
దరస వివేక సంపద స
దా శుకవాక్య సుధానుభూతి మో
హరహితవృత్తి బ్రస్ఫురద
నంగరహస్య విచారబుద్ధి న
ప్పురమున గామినీజనులు
పోల్తురు యోగిజనంబు పోలికన్"

అన్న పద్యాన్ని వచ్చిన యెనమండుగు రప్సరసలు ఒకటే రొదగా "ఏ మండీ ధూర్జటి గారూ, పదాల గారడీ చాతనాననా పట్నంలో కామినీజనం యోగిజనంలా గుంటారని శ్లేషించడం! దాన్లో అందమేమిటి? మీ మాయ బుద్ధిని వేదాంతంలో కప్పుదామనా, నేర్చుకు పోయినా"రని బుగ్గలు పొడవడ మారంభించే టప్పటికి తడి మంత్రాహ్వాన మొస్తే దులుపు కొచ్చా. తాతగారూ, ఇతడు కాళ్లూ చేతులూ సర్దునీకో కుండా తొందర పెట్టా డేమిటండీ! చక్కని పట్టులోనుంచి లేవదీశాడు.

నే : (ధూర్జటితో) మీ కక్కడకూడా భూలోకంలో లాగే చక్కని కాలక్షేప ముంద న్నమాట!

ధూ : అంటున్నావోయ్ అను! కృష్ణ రాయ లంటేనే మాకు లెక్క లేక పోయింది.

నే : రాయలే, రాయలవార్ని!

ధూ : మీ కంతా యెక్కువైతే అతని విగ్రహం చెక్కించుకొని పూజ్జేయండి. మాకేం లెక్కలా.

నే : ఎంత గర్వమండీ మీకు?

ధూ : గర్వమేమిటి? అట్లాటివాళ్ల నుద్దేశించే 'అల్పుల్ మత్తులై యేల చచ్చెదరో రాజుల మంచు నక్కటకటా! శ్రీ కాళహస్తీశ్వరా!' అన్నాం తాతగారూ.

నే : తిమ్మన్నగార్ని తాతగా రన్నారేం పెద్దనగా రుండగా?

ధూ : ఏమిటీ, పెద్దనగా రుండగానా? ఆయన పెట్టుతాతా, యీయన పుట్టుతాతా.

నే : నా కర్థంకాలా?

ధూ : ఈయన తాతరికం పుటకతో వచ్చింది, సహజమైంది; ఆయన తాతరిక మెవడో డై పెనే వచ్చింది. కృష్ణరాయ డేదో అంటే వచ్చింది. వైష్ణవాభిమానంచేత మధ్య వైష్ణవుడి కొక బిరుదుకూడాను!

నే : అదేమిటండీ మధ్య వైష్ణవుడు!

ధూ : కాకేమిటి వైష్ణవ కుటుంబంలో పుట్టాడా? మధ్యనా మతాన్ని స్వీకరించాడు రాజు కిష్టమని. అట్లాటప్పు డేమాతాడు మధ్య వైష్ణవుడుకాక?

తి : కావచ్చు గాని, ఆ బిరుదుకు తగ డంటారా పెద్దన?

ధూ : ఇంతకూ నా అభిప్రాయ మెవరి గ్గావాల? ఆ కాలంవాండ్లంతా బ్రహ్మరథంపడ్డే, ఈ కాలంవాండ్లంతా ఆహాలే, పాడితే!

తి : అల్లా అనకోయ్, ఆయన సకలవిధములా సమర్థుడూ! ఆ ప్రభు వింగితజ్ఞుడూ, పండితుడూ!

ధూ : ఉఁ మీ రట్లా గనం దెప్పుడూ? ఆ ఆముక్తమాల్యదన సభలో చదివినప్పుడైనా నా పక్షం బలికారా, రాయలంది మహా బాగుం దని బుర్రూపారు కాని! ఒక్క రామకృష్ణుడు మటుకు నాతోబాటు మొగం ముడిబెట్టాడు.

నే : ఆయనా చివరకు వైష్ణవం బుచ్చుకు న్నాడుగా?

ధూ : ఆ, వాడొక మధ్యవైష్ణవుడు! ఈ యన, సూరన్న, నేనూ నామాలకు నామాలు పెట్టాంగాని, మిగతా వాండ్లంతా పంగనామా లెట్టినవాండ్లే!

నే : విష్ణుచిత్తీయం చదివిన రోజున నేమైం దేమిటండీ!

ధూ : ఏమో అయింది. వార్నడుగు; నా కది మంట.

నే : తాతగారూ, ఏమైం దేమిటండీ.

తి : (గొంతు సవరించుకొని) మా ప్రభువుకు వైష్ణవ మంటే అభిమానం. అదొక్కొకసారి స్మార్తులకు దుర్భరంగా వుండేది. ఒక దినమొక వైష్ణవు డొచ్చాడు. ఆ నాడు రాయలవారు మహాసభ చేసి విశిష్టాద్వైతమత చర్చ సాగించారు. డిండిమభట్టునుమడద్వైత మతాన్ని గురించి వాదించడానికి కుదిర్చారు. రాయలు మధ్యస్థంగా వుండి-చివరకు వైష్ణవుడే గెల్చా డన్నారు. అది అన్యాయ మని మా ధూర్జటికి తోచి—

ధూ: ఒళ్లు మండిపోతె బైటికొచ్చి యెద టున్న పాముకోళ్లు, పల్లకీ యేదీ కనుపించలా నాకు: అరు గ్గూడా కాలికి తగిలింది. అదంతా తెలిసిన కృష్ణరాయడు తన గ్రంథంలో నా పట్టు వచ్చినప్పుడు ఆవాళ నా తత్తరంతా పూస గుచ్చినట్లు కూర్చాడోయ్.

తి: ధూర్జటీ, నీకు తొందరా, కోపం ఎక్కువ గాని కవి కల్పించిన దృశ్యాల్లో రసవంతమైన దాన్ని జ్ఞాపక ముంచుకొని వ్రాయడం తప్పా! ఆ సందర్భంలో తోచే తత్తర్ను నీవుమటు కెట్లా వర్ణిస్తావు. అట్లా వర్ణించక! ఎందుకో యింకా దాన్ని పురస్కరించుకుని మాట్లాడావ్! అదిజరిగి యెన్నాళ్లైంది. యేం కథ!

ధూ : ఏమో తాతా, నా కెప్పుడూ అట్లా గుంటుంది, నా కర్మం నన్నేం జేయమన్నారు?

నే : (విషయం మారిస్తే బాగుండునని) తమది కాళహస్తండీ? ఏదీ నెల్లూరు దగ్గర కాళహస్తేనా!

ధూ : ఔను. ఇంకొక కాళహస్తెక్కడుంది?

నే: అబ్బా. మీవూళ్లో నంత దోమ లేమండీ?

ధూ: ఇదుగో, ఇట్లాటి పిచ్చిప్రశ్న లేయడానికా మమ్మల్ని చక్కని రసవంతమైన పట్టులోంచి దిగలాక్కొచ్చింది? మీకు రైళ్లూ బొయిళ్లూవున్నాయి గాబోలు, ఈ కాలంలో. ఎక్కిపోయి చూచి పరిశోధించి కనుక్కో!

నే: ఎంత తొందరా కోపమండీ మీకు తాతగా రన్నట్లూ! ఊరివారుగదా అని అడిగితే తప్పాండీ?

ధూ: ఏమి టీ సంతా! మా కాలంలో ఒక్కదో ముండేదికాదు. మీ రంతా యేమి టేమిటో నవనాగరకులుగా, ఆ నాగరకతతో వచ్చా యా వెధవదోమలు.

నే : ఎందుకనండీ?

ధూ: ఎందుకో—ఇదో చూడూ? మీ కాలంలో పరిశోధ నొక తెగులైంది. ప్రతిదానికి పరిశోధనే. ఇదెందుకూ అదెందుకూ, అని గోల తీ డబ్బు తగలేసి పరిశోధించడమే గాని ఒక్క చెడు విషయాన్నీ నిర్మూలం చేసిందిలేదు. ఒకొక్క సారి ఒక చెరువు నాపబోయి, మరొక చెరువును దెచ్చి పెట్టారు. ఎందు కీ అపరిపూర్ణ ప్రజ్ఞోన్మాదం? ఇంతటాపి, కావలసిం దడుగు.

నే: చిత్తం. తాతగారూ, తమది గన్నవరమా?

తి: ఔ న్నాయనా?

నే : ఏది, మేమంతా అనుకునే దొంగల గన్నవర మేనా?

తి : నాకు తెలీదు. విజయవాడ దగ్గరున్న గన్నవరం.

నే : అంటే, తమకాలంలో దాని కా పేర్లేదన్నమాట. సరే—తమరు శ్రీ కృష్ణరాయల వారి కిచ్చిన ఓఢ్రరాజు కుమార్తెగారితో హరణ మొచ్చారా విజయనగరానికి?

తి : ఔను.

నే : భర్తగారికి వారికి సరిపడలే దని, అందుకని వారు విడిపోయి కంభంలో నేదో కోట గట్టుకుని వుండేవా రనీ...యింకా యేదో యేదో చెప్పుకుంటారే తమరుగూడా వార్తో వెళ్లకుండా విజయనగరంలోనే వుండిపొయ్యారేం?

తి : నీవు విన్నవిషయం నిజమే. మా అమ్మాయిగారిమీద రాయలవారికి కోప మొచ్చి, అట్లా జరిగిందని తెలియగానే నేను పారిజాతాపహరణం గూర్చి శ్రీ వారి కంకిత మిచ్చా. అది విన్నానికైనా వారికి దయరాదా అనుకుంటే కొన్ని నెలలైనా రాలా. అప్పటికి లాభం లే దనుకుని సెలవు పుచ్చుకుని వెళ్దాం అనుకుంటుండగా బదిహేనురోజులు జ్వర మొచ్చి అది ప్రబలి వ్యాధి గ్రస్తుణ్నై యీ లోకంతో సంబంధం వదిలింది.

నే : అయితే తమ జబ్బు కా విషయం కారణమా?

తి : అంతవరకు లేదుగాని, యేమిరా మా ప్రభు కుమార్తె కిట్లా వచ్చెనే అన్న చీకుమటుకు మనస్సులో ప్రవేశించింది.

నే : చిత్తం పాపం! తమ రంటే ఆస్థానంలో కవు లందరికి యిష్టమేనాండి?

ధూ : వీ రంటే జగత్తంతకూ యిష్టం. ఒకర్ని వీరు పల్లెత్తుమా టని యెరగరు. ఒకరు వీర్న నెరగరు. ఇంత సర్వసములు మా ఆస్థానంలో లేరు.

నే : కారణం?

ధూ : శీలం. ఈయనగారు నిగర్వశిరోమణి. తాతా, ముద్దు లొలికే కవిత్వం చెబ్తారంటే 'నాయనా దాన్లో నే ముందోయ్. ఆ దేవి అట్లా పలికిస్తుం' దనేవారు.

నే : రాయలవారికి వీరంటే అభిమానమేనా అండి?

ధూ : అభిమాన మేమిటి! రహస్య పర్యటనకై ఆ వైపులకు వెళ్లినపుడు అతడు వీర్ని చూడందే వెళ్లేవాడు కాడు.

నే : భట్టుమూర్తి వీరంటే యెట్లా గుండేవాడండి?

తి : నన్నెప్పుడూ అత డేమీ అనలా. ఏమిటో, చిన్నతనపు కొంటెతన ముండే దతని దగ్గర.

నే : రామకృష్ణుడో?

తి : (ముసిముసినవ్వులు నవ్వుతూ) వాడో జగకొంటె. అవ్వను బట్టరా వసంత మన్నట్లు నన్నప్పు డపు డాటలు పెట్టించేవాడు వేళా పాళా లేకుండా.

ధూ : దానికి దగ్గ ప్రహరణా ల్తగుల్తుండేవి.

నే : చిత్తం, మేము చెప్పుకుంటుంటాం!

తి : ఏమిటో, పోనిస్తురూ, చిన్నతనం!

నే : ఒక్కమా టడుగుతా; నిద్దరూ దాచుకోకుండా చెప్పండి.


ధూ : అడుగు? దాచుకోవడమెందుకూ?

నే : నిజంగా పెద్దనగారి కవిత్వాన్ని గురించి మీ అభిప్రాయ మేమి?

ధూ : ఇదా, ఇందాకట్లా గన్నామనా! ఆ సందర్భంలో నట్లాగన్నామ్. అయినా బిరుదు లెందు కన్నాంగాని, ఆయ నొకమాట మాట్లాడినా ఒక పద్యం కూర్చినా అద్భుతంగా వుండేది. వారి రచన్లో ఒక మాట దీసి మరొకమాట బెట్టడానికి వీలుండదు. ఆయ నుపన్యసిస్తే వింజామర్లు కొట్టాల్లుండేవి. అంత గంభీరప్రజ్ఞావంతుడికి బిరుదెందుకూ? కవి అనే బిరుదు చాలదూ, ఊకు బోక చేసే పనికాని.


నే : చిత్తం. నన్నయ్యగారికి మల్లే నే అన్నారే!

(21-వ పేజీ చూడుడు)


సులువైన యీ చిన్నమార్గాన్ని అనుసరిస్తే జీవశక్తి, శరీరశోభ, సౌందర్యము, మొదలగు నవన్నీ మీ సొమ్మే. కేవలము వనస్పతి సంబంధమైన యీ 'బైల్‌బీన్సు' విరేచనమందును విడువకుండా పుచ్చుకుంటే, నిత్యసుఖ విరేచనం, మంచి జీర్ణాశయం, స్వచ్ఛమైన రక్తస్రావం వల్ల యేర్పడు లోపలి ఆరోగ్యము పెంపొందును.

కోల్పోయిన శక్తిని సంపాదించుటకు, ఆరోగ్యాన్ని, ఆకార సౌష్ఠవాన్ని, కాపాడుకొనుటకు మీకు కావలసింది 'బైలుబీన్సు' అని ఎల్లపుడు జ్ఞాపకముంచుకొనుడు.




కేవలము వనస్పతి సంబంధమయిన

బైల్ బీన్సు

BILE BEANS

ప్రతిరోజు పడుకొనబోయే ముందు సేవించుము.

ఏజంట్లు: దాదా అండ్ కంపెనీ, నైనియప్పనాయక్ వీధి, పి.టి. మద్రాసు.